క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం





మధు(ఫైల్)

ఐనవోలు : గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో వ్యక్తి దుర్మరణం చెందాడు. మండలంలోని పున్నేలు క్రాస్ సమీపంలోని ఏకశిల స్కూల్ వరంగల్–ఖమ్మం రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన నాంపెల్లి మధు (34) వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై హనుమకొండకు వెళ్లాడు. తిరిగి బుధవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై స్వగ్రామం ఇల్లందకు వస్తుండగా మార్గమధ్యలో పున్నేలు క్రాస్ సమీపంలోని వరంగల్–ఖమ్మం రహదారి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో మధు తలకు బలమైన గాయాలు కాగా రక్తస్రావమై అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ.3,070 నగదు, పేకముక్కల స్వాధీనం



ఎల్కతుర్తి : మండలంలోని కోతులనడుమ గ్రామంలో గల రైతువేదిక సమీపంలో కొంత మంది వ్యక్తులు పేకాడుతున్నారనే పక్కా సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన సల్లా రాజు, పంద్రాల భిక్షపతి, బండ రాజయ్య, పల్లెబోయిన రవి, కాశరాజు, కోతులనడుమ గ్రామానికి చెందిన కొమ్మ రాజు మల్లయ్య, మరోవ్యక్తి కలిసి పేకాడుతుండగా వారిని పట్టుకుని పేకాటముక్కలతో పాటు రూ.3,070 నగదు, ఒక ఆటో, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. కాగా శ్యామ్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ దాడులో ప్రొబెషనరీ ఎస్సై గోవర్ధన్, హెడ్‌కానిస్టేబుల్ విఠల్‌రావు, భాస్కర్ రెడ్డి, వీరస్వామి పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మండలంలోని బావుపేట నుంచి దండేపల్లి గ్రామాల మధ్యలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మానేరు వాగు నుంచి రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా బావుపేట వంతెన వద్ద ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్లతో పాటు డ్రైవర్లు వీణవంకకు చెందిన గౌస్, దాసారపు రాకేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

'ఎమ్మెల్సీగా గెలిపించాలి'

హసన్‌పర్తి : వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బలపరిచిన పులి సరోత్తంరెడ్డిని గెలిపించాలని బీజేపీ నాయకులు మండల కేంద్రంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రాంచంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు తిరుపతి, చకిలం రాజేశ్వర్‌రావు, మట్టెడ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రవీందర్‌రావును కలిసిన పీఏసీఎస్ చైర్మన్లు

వరంగల్ : రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల పదవీ కాలం ఆరునెలలు పొడిగించిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర అపెక్స్ బ్యాంక్ (టీజీసీఏబీ) చైర్మన్ మార్నేని రవీందర్‌రావును బుధవారం వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని పీఏసీఎస్ చైర్మన్లు కలిసి పూలబొకేలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. కాజీపేట దర్గా, వరంగల్, పర్వతగిరి, మల్లారెడ్డిపల్లి పీఏసీఎస్‌ల చైర్మన్లు ఉకంటి వనంరెడ్డి, ఇట్యాల హరికృష్ణ, మనోజ్‌గౌడ్, జక్కు రమేష్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

చదువుపై దృష్టిసారించాలి

కాజీపేట : విద్యార్థులు తమ విలువైన సమయాన్ని సెల్‌ఫోన్లతో గడపకుండా చదువుపై దృష్టి సారించాలని సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్ సూచించారు. కాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం సంస్కార వికాస శిక్షణ సదస్సును నిర్వహించగా మాట్లాడారు.

ఈ అన్నం మాకొద్దు..

- మధ్యాహ్న భోజనంలో పురుగులు
- అసహనం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు
- ఇంటినుంచే బాక్స్‌లు..
- పాఠశాలలో తాగునీరు, టాయిలెట్స్ లేకపోవడంతో తప్పని తిప్పలు



మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు



ఇంటి నుంచి టిఫిన్ బాక్స్‌లో అన్నం తెచ్చుకుని తింటున్న విద్యార్థులు

శాయంపేట : ప్రభుత్వ పాఠశాలలో వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని తినలేమని, అన్నం, కూరలో పురుగులు వస్తున్నాయని మండలంలోని నేరేడుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అసహనం వ్యక్తం చేశారు. వారం రోజులుగా ఇంటినుంచి బాక్స్ తెచ్చుకుంటున్నామని తెలిపారు. నేరేడుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 75మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు విద్యార్థులకు అందించే భోజనంలో పురుగులు రావడంతో విరక్తి చెందిన కొంతమంది విద్యార్థులు తమ ఇంటినుంచి టిఫిన్‌బాక్స్‌ల్లో భోజనం తెచ్చుకుంటున్నామని అంటున్నారు. ఇదే విషయం విద్యార్థులను అడుగగా అన్నం, కూరల్లో పురుగులు వస్తున్నాయని, కూరలు నాణ్యత లేకుండా వడ్డిస్తున్నారని, చాలా రోజుల నుంచి ప్రధానోపాధ్యాయురాలు మాధవికి తెలపడమే కాకుండా రాతపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. అదే విధంగా పాఠశాలలో తాగునీరు, చేతులు, ప్లేట్లు శుభ్రపరుచుకునేందుకు నల్లాలు లేక, పాఠశాల బయట మిషన్ భగీరథ పైపుల్లో వచ్చే నీటిని బాటిళ్లలో పట్టుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పాఠశాల బయట మిషన్ భగీరథ నీటితో పేట్లు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

ఒకటి, రెండుకు ఆరుబయటకే..

పాఠశాలలో టాయిలెట్స్ లేకపోవడంతో మల, మూత్ర విసర్జనకు రోడ్డు దాటి వ్యవసాయ పొలాల్లోకి వెళ్లాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. పరిసర ప్రాంతంలో క్రషర్లు ఉండడంతో రోడ్డుపై లారీలు, టిప్పర్లు రాకపోకలు సాగిస్తుంటాయని, టాయిలెట్‌కు వెళ్లివచ్చే క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సాంబారును పోలిన పాలకూర పప్పు

ఇంటినుంచి బాక్స్ తీసుకొస్తున్న



పాఠశాలలో వడ్డించే అన్నం, కూరల్లో పురుగులు వస్తున్నాయి. తినలేకపోతున్నాం. ఇంటినుంచి టిఫిన్ బ్యాక్స్ తెచ్చుకొని తింటున్నాం. నాణ్యమైన భోజనం వండి పెట్టేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి.

- ఎస్.చరణ్, 6వ తరగతి

చర్యలు తీసుకుంటాం..

ప్రస్తుతం ప్రధానోపాధ్యాయురాలు మాధవి సెలవులో ఉన్నారు. మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నాయనే విషయం మా దృష్టికి రావడంతో వెంటనే ఎంఈఓ భిక్షపతికి తెలియపరిచాం. ప్రధానోపాధ్యాయురాలు రాగానే తీర్మాణం చేసి మధ్యాహ్న భోజన నిర్వాహకులను తొలగించి వేరేవారిని నియమించి నాణ్యమైన భోజనం వడ్డించేలా చర్యలు చేపడుతాం.

- చిన్నేశ్వర్‌రావు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం

నాణ్యతాలోపం లేకుండా చూస్తాం

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేదని, తాగునీరు సమస్య ఉందని మా దృష్టికి వచ్చింది. మధ్యాహ్న భోజన నిర్వాహకులను తొలగించడానికి ఎంపీడీఓకు, ఏపీఎంకు లేఖ రాసి కొత్త వారిని నియమించాలని ప్రధానోపాధ్యాయురాలు మాధవిని ఆదేశించాను. తాగునీటి టాయిలెట్స్ సమస్యను త్వరగా పరిష్కరిస్తాం.

- భిక్షపతి, ఎంఈఓ

పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం : కడియం

ధర్మసాగర్ : పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బాధిత కుటుంబ సభ్యునికి రెండు లక్షల విలువ గల ఎల్‌ఓసి ని బుధవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి అందచేశారు. మండల కేంద్రానికి చెందిన రాయిల్ల కుమారస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. వారి ఆర్థిక పరిస్థితిని మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి శరత్ స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే కడియం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రెండు లక్షల రూపాయల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. ఎల్‌ఓసి పత్రాన్ని హనుమకొండలోని కడియం శ్రీహరి నివాసంలో కుమారస్వామి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రావుల వెంకట్ రెడ్డి, ఎండీ.హఫీజ్, విస్నూతో పాల్గొన్నారు.



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

మహిళలు, బాలికల సంక్షేమం అందరి బాధ్యత

ఆత్మకూరు : మహిళలు, బాలికల సంక్షేమం అందరి బాధ్యతని పంచాయతీరాజ్ జిల్లా ట్రెనింగ్ కో ఆర్డినేటర్, ఆదర్శ గ్రామ పంచాయతీ గంగదేవిపల్లి మాజీ సర్పంచ్ కూసం రాజమౌళి అన్నారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దాపూర్‌లో బుధవారం గ్రామస్థాయి కమ్యూనిటీ ఆధారిత సంఘాల నాయకులకు ఏర్పాటు చేసిన లింగాధారిత హింస నివారణ, సహకరించే వ్యవస్థలు, రక్షణ చట్టాలుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి సమన్వయకర్తగా ఆయన మాట్లాడారు. మహిళలు కుటుంబంలోని అందరి శ్రేయస్సు కోసం ఆలోచిస్తారని, బాధ్యతలు, పనులతో కష్టపడతారని అన్నారు. మహిళలు తమ నైపుణ్యాలు, బాలికలు విద్యపై దష్టిపెట్టాలని సూచించారు. తప్పనిసరిగా వ్యక్తిగతం, సామాజిక, ఆర్థిక, అభివృద్ధి అంశాలపై అవగాహన పెంపొందించుకుని ముందుకెళ్లాన్నారు. గ్రామాల్లోని మహిళలు ఎలాంటి సమస్యలు ఎదురైనా ఎదుర్కొనే విధంగా ఉండాలని అన్నారు. సమస్యల్లో ఉన్న మహిళలకు అండగా చట్టాలు, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఉన్నాయని వాటిని ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం సర్వోదయ ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఇందిర మాట్లాడుతూ.. న్యాయ పరంగా చట్టాలు, అత్యవసర పరిస్థితుల్లో రక్షణ, ఆశ్రయం కల్పించే వ్యవస్థలు ఉన్నాయని, వాటి ఆధారంగా మహిళలు మంచి భవిష్యత్ ఏర్పర్చుకోవాలని అన్నారు. సర్వోదయ సంస్థ స్త్రీ శిశు అభివద్ధి సంస్థ సహకారంతో హనుమకొండ జిల్లాలో సఖి కేంద్రాన్ని నిర్వహిస్తు బాధిత మహిళలకు అండగా నిలుస్తోందన్నారు. బాధితురాలు సఖి కేంద్రం సేవలను వినియోగించుకోవాలని అన్నారు. భరోసా కౌన్సిలర్ సుమలత, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు రవీందర్, ప్రశాంత్, కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజమౌళి

ఉద్యమానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు

- బొడ్డు దయాకర్

ధర్మసాగర్ : ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపున్నామని ఎమ్మార్పీఎస్ జాతీయ పొలిట్ బ్యూరో మాజీ సభ్యుడు బొడ్డు దయాకర్‌మాదిగ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ దండోరా 30 ఏళ్ల ఉద్యమ ప్రస్థానానికి సహకరించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు వివిధ ప్రజా సంఘాలు, కుల సంఘాలు, వివిధ పార్టీల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియలో జరిగిన లోపాలను గుర్తించి సరిదిద్దాల్సిన అంశాలపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపాయింట్మెంట్ ఇచ్చి మంద కృష్ణమాదిగ సలహాలు, సూచనలను స్వీకరించి లోపాలను సవరిస్తానని సీఎం హామీ ఇవ్వడం సంతోషకరమన్నారు. త్వరలో జరగబోయే లక్ష డప్పులు– వేల గొంతల సభకు ప్రతి మాదిగ బిడ్డ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతిసాగర్, నాయకులు అన్వేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొడ్డు దయాకర్

యువత వ్యసనాలకు బానిస కావొద్దు

- ఎస్సై పరమేశ్

శాయంపేట : యువత వ్యసనాలకు బానిసై తమ జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎస్సై పరమేశ్ అన్నారు. మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలో పోలీస్ కళాజాత బృందంచే గ్రామస్తులకు అవగాన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. యువత గంజాయి, గుట్కా, మద్యానికి బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. ప్రజలు మూఢనమ్మకాలను నమ్మవద్దని సూచించారు. గ్రామస్తులు బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దని, బాల కార్మికులతో పని చేయించొద్దని అన్నారు. బాల్య వివాహాలు జరిగితే 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏఎస్సై కుమారస్వామి, కళాబృందం నాగమణి, విలియమ్, రత్నయ్య, పూల్‌సింగ్, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్‌రాజ్, చిరంజీవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై పరమేశ్

కష్టపడి పనిచేస్తే గుర్తింపు

ఆత్మకూరు : యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే తగిన గుర్తింపు వస్తుందని యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త పనిచేయాలని అన్నారు. అలాంటి వారిని పార్టీ గుర్తించి తగిన ప్రాధాన్యం కల్పిస్తుందని అన్నారు.

ఉపాధి కూలీలకు వసతుల కల్పన

ఆత్మకూరు : ఉపాధి కూలీలు పనిచేసే చోట అన్ని సౌకర్యాలు కల్పించామని ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి అన్నారు. మండలంలోని కామారంలో ఉపాధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేసవికాలం సమీపిస్తున్నందున కూలీలకు నీడ సౌకర్యం, తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. కూలీలు పనిరోజులను పెంచుకుని ఆర్థికంగా బలపడాలని అన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

వరంగల్ : నగరంలోని వెంకట్రామా జంక్షన్ నుంచి లేబర్ కాలనీ వరకు వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించాలని టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ కోరారు. ఈమేరకు బుధవారం మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..లేబర్ కాలనీ నుంచి వెంకట్రామా జంక్షన్ వరకు ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతున్నాయని, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలిపినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈవిషయంపై స్పందించిన మంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ప్రకాశ్ తెలిపారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై విచారణ

- గ్రామసభలో గందరగోళం
- అధికారులను ప్రశ్నించిన స్థానికులు
- ఫిర్యాదుదారులు సంతకాలు చేయలేదని ముగించిన విచారణ

దామెర : మండలంలోని తక్కళ్లపాడ్ గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై గ్రామపంచాయతీలో విచారణ నిర్వహించగా గందరగోళం నెలకొంది. ఇటీవల గ్రామంలో గ్రామసభ నిర్వహించి అర్హులను ఎంపిక చేయగా గ్రామానికి చెందిన కొందరు అనర్హులను ఎంపిక చేశారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ విచారణ చేసి నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. దీనిపై మరల కొంత మంది వ్యక్తులు విచారణ బహిరంగంగా చేయలేదంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం ఎంపీఓ రంగాచారి, ఏపీఓ శారద, గ్రామ ప్రత్యేకాధికారి సమ్మిరెడ్డి విచారణ నిర్వహించారు. విచారణలో భాగంగా ఆత్మీయ భరోసా పథకంలో అర్హుల ఎంపికతో పాటు ఉపాధి జాబ్ కార్డుల జారీలో పలు లోపాలున్నాయంటూ చేసిన పలు ఫిర్యాదులను అధికారులకు వివరించగా ప్రజలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ క్రమంలో మాజీ సర్పంచ్ రాజేందర్ గ్రామసభనా లేక విచారణ అని అధికారులను ప్రశ్నించగా.. ఎంపీఓ స్పందిస్తూ ఫిర్యాదు దారులు కోరిన విధంగానే గ్రామంలో విచారణ చేస్తామన్నారు. కాగా ఫిర్యాదుదారులను సంతకాలు చేయాలని కోరగా వారు నిరాకరించడంతో విచారణ పూర్తయ్యిందంటూ అధికారులు విచారణను ముగించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి మణిదీప్, టీఏ సురేందర్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న అధికారులు

చిన్నారులకు యూనిఫాం అందజేత



దామెర : విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న సూపర్‌వైజర్ రాణి



ఆత్మకూరు : విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

దామెర : మండలంలోని దామెర, ల్యాదెళ్ల, సింగరాజుపల్లి, పులుకుర్తి, కొగిల్వాయి, వెంకటాపూర్ గ్రామాల్లోని 20 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 320 మంది 3నుంచి 6సంవత్సరాల్లోపు ప్రీ స్కూల్ చిన్నారులకు మహిళా శిశు సంక్షేమశాఖ వారు నూతనంగా రూపొందించిన యూనిఫాంను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతన విద్యా విధానంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ, ప్రాథమిక విద్యా పాఠశాలలుగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. అందులో భాగంగా అంగన్‌వాడీ చిన్నారులకు ఆటపాటలతో విద్యనందిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలను ఆహ్లాదకరంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు వాణి, శోభారాణి, కోమల, రజిత, వనజ, గౌరీ, ఫాతిమా, పుష్పలీల, జయ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

ఆత్మకూరు : మండలంలోని అక్కంపేట జెడ్పీహెచ్ఎస్‌లో 1999–2000 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు బుధవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. అలాగే పాఠశాల ఆఫీస్ సబార్డినేట్ సరస్వతికి ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు మల్లికార్జున్, రజిత, రమేశ్‌తో పాటు పూర్వ విద్యార్థులు రాజు, అశోక్, మల్లేశ్, వేణు, రాజు, రాజు, కృష్ణప్రసాద్, అశోక్, భాస్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు అనుకూలంగా కేంద్ర బడ్జెట్

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు

హన్మకొండ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్‌కు అనుకూలంగా ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వివక్ష చూపడంపై బుధవారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల నాయకులు చేతికి సంకెళ్లతో వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణ పట్ల సవతి తల్లి వైఖరిని ప్రదర్శిస్తోందన్నారు. ఏపీ పునర్విభజన చట్టం అమలును బీజేపీ నిర్లక్ష్యం చేసిందని, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ములుగులో గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయించలేదన్నారు. లక్షలాదిమంది యువకులకు ఉపాధి కల్పించే బయ్యారం ఉక్కు పరిశ్రమ ప్రాజెక్టును మూలకు పడేయడం దారుణమన్నారు. సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, ఎస్.జ్యోతి, సదాలక్ష్మి, కె.శివాజీ, ఎస్.వాసుదేవ రెడ్డి, ఎ ం.చుక్కయ్య, బొట్ల చక్రపాణి, మద్దెల ఎల్లేష్, ఉ ట్కూరి రాములు, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, రాసమల్ల దీనా, బత్తిని సదానందం, మా లోతు శంకర్ నాయక్, సుదర్శన్, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, రొంటాల రమేష్, దేవా, కామెర వెంకటరమణ, గుంటి రాజేందర్, నిమ్మల మనోహర్, వీరన్న నాయక్, జి.రాములు, సాంబయ్య పాల్గొన్నారు.

వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ సెంటర్ ధర్నా

వరంగల్ చౌరస్తా : కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని కమ్యూనిస్టు పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. 10 కమ్యూనిస్టు, విప్లవ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ సెంటర్‌లో ధర్నా చేశారు. దీంతో అరగంట సేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా నాయకులు ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. న్యూడెమొక్రసీ నేత రాచర్ల బాలరాజు ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఎం జిల్లా నాయకురాలు నలిగంటి రత్నమాల, పలు పార్టీల నాయకులు గంగుల దయాకర్, అక్కెనపల్లి యాదగిరి, సుంచు జగదీశ్వర్, సత్యనారాయణ, ఎండీ బషీర్, ఆడెపు సదయ్య, పనాస ప్రసాద్, ఐతం నగేశ్, టి.భవాని, దుర్గయ్య, ఇనుముల శ్రీనివాస్, రంజిత్, గన్నారపు రమేశ్, గంద్రతి హరిబాబు, ప్రశాంత్, మాలి ప్రభాకర్, దేశెట్టి సమ్మయ్య, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

శివాజీ పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోవాలి

తెలుగు సంప్రదాయ, సంస్కృతిని కాపాడేందుకు ఛత్రపతి శివాజీ చేసిన పోరాటం చిరస్మణీయమని, ఆయన పోరాట పటిమను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ అన్నారు. బుధవారం కమలాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ఛత్రపతి శివాజీ జయంతిలో ఆయన పాల్గొని శివాజీ విగ్రహానికి పూలమాల వేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఆరె సంక్షేమ సంఘం, బీజేపీ, కాంగ్రెస్, అంబేద్కర్, పలు రాజకీయ, కుల సంఘాల ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



కమలాపూర్ : శివాజీ జయంతిలో ఆరె కులస్తులు



ఆత్మకూరు : శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తూ..



ఎల్కతుర్తిలో..

ఆధునిక సాగుపై అవగాహన ఉండాలి



ఖిలా వరంగల్ : ఆధునిక వ్యవసాయ సాగు విధానంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న, శాస్త్రవేత్త సౌమ్య సూచించారు. ఈమేరకు బుధవారం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఎస్ఆర్ యూనివర్సిటీ విద్యార్థులు సందర్శించారు. ఈసందర్భంగా నూతన సాగువిధానం, పంటలను విద్యార్థులు పరిశీలించారు. అనంతరం చేపలు, నాటుకోళ్ల పెంపకం వల్ల వచ్చే లాభాలను వివరించారు. ఎస్ఆర్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సాయి కృష్ణారెడ్డి, శ్రీను, శ్రావ్య, పూజ, శ్రీవాత్సవ్, మానస, అమిత్, రవితేజతో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు